క్లుప్తంగా

శ్రీకోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ సమీపాన కొండపై వెలసిన శ్రీకోనా వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కొలువైన భూదేవి, అలివేలిమంగమ్మ సమేత శ్రీ కోనా వేంకటేశ్వరస్వామివారి మూల విగ్రహాలకు అభిషేకంతోపాటు ప్రత్యేక పుష్ప, పత్రాలతో అలంకరించారు. గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకూర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గని గ్రామంలో 'పొలంబడి'



పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న ఏఓ హేమసుందర్‌రెడ్డి

గడివేముల: మండల పరిధిలోని గని గ్రామంలో శనివారం ఏఓ హేమసుందర్‌రెడ్డి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మేలైన వ్యవసాయ సాగు పద్ధతులతో కంది పంట సాగుపై ఏఓ రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు రైతులకు అందుబాటులో ఉంటూ పంటల సాగుపై సూచనలు ఇవ్వాలని ఏఓ ఆదేశించారు.

పాడి రైతులకు ప్రోత్సాహం



పాడిరైతుకు నగదు అందజేస్తున్న మధుసూదన్‌రెడ్డి

గడివేముల: పాడిరైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా విజయ డైరీ ప్రోత్సాహం అందిస్తుందని డైరీ సూపర్‌వైజర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన గడివేములలో విజయడైరీకి పాలను విక్రయిస్తున్న లబ్ధిదారులకు బోనస్ డబ్బులను శనివారం అందజేశారు. 20 మందికి రూ.42,157 బోనస్ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో విజయ డైరీ నిర్వాహకుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రకు పోటెత్తిన వరదనీరు



సంగాల గ్రామం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర నది

సి.బెళగల్: తుంగభద్ర నదికి శనివారం వరద నీరు పోటెత్తింది. శుక్రవారం సాయంత్రం సి.బెళగల్ మండల పరిధిలోని నదికి ప్రవేశించిన వరదనీరు నేటి ఉదయం ప్రవాహం ఉధృతంగా మారింది. లక్ష క్యూసెక్కులపై పారడంతో నీటి ప్రవాహం అమాంతం పెరిగింది. తుంగభద్రమ్మ ఉరుకలేస్తూ కృష్ణానదివైపు సాగింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా సరిహద్దుగా ఉన్న తుంగభద్ర నది వరదనీరు రెండు రాష్ట్రాల దడులను తాకుతూ ప్రవాహం కొనసాగుతుంది.

ఆక్రమిత ప్రభుత్వ భూముల పరిశీలన



భూముల హద్దులను పరిశీలిస్తున్న అధికారులు

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్ ముక్కల గట్టులో ఆక్రమిత ప్రభుత్వ భూములను శనివారం పంచాయతీ కార్యదర్శి సునీల్ రాణి, వీఆర్వోలు శేఖర్, నాగమ్మ పరిశీలించారు. ఆక్రమణలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు భూములను పరిశీలించిన వారు ఆక్రమణదారులకు నోటీస్‌లు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పట్టా తదితర ఆధారాలు లేకుండా భూములను ఆక్రమించుకున్న వారిపై క్రినల్ కేసులు నమోదు చేసేందుకు పోలీస్‌లకు నివేదికలు సిద్ధం చేస్తున్నట్లు వారు తెలిపారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన గౌరు దంపతులు

కల్లూరు: పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు శనివారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాణ్యం నియోజకవర్గంలో పలు అంశాలపై కలెక్టర్‌తో చర్చించినట్లు సమాచారం.

విద్యా రంగానికి అన్యాయం

కర్నూలు(సెంట్రల్): కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి తీవ్ర అన్యాయం జరిగిందని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శులు ఈ.భూషణం, కె.భాస్కర్ ఆరోపించారు. శనివారం న్యూడెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పీడీఎస్‌యూ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర కేటాయింపులు చేశారన్నారు. కనీసం 10 శాతం బడ్జెట్‌ను కేటాయించాలని కోరుతున్నా పట్టించుకోకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు.

పంటల నమోదు...లేనట్టేనా ?

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలవుతున్నా కనిపించని ఈ క్రాప్ నమోదు
- కనీసం స్పష్టత ఇవ్వని టీడీపీ ప్రభుత్వం
- ఇప్పటికే మండలంలో 75 శాతం భూముల్లో వివిధ పంటలు సాగు
- ఒకవేళ పంటనష్టం జరిగితే ఏంటి పరిస్థితి
- ఆందోళనకు గురవుతున్న అన్నదాత





బిలకలగూడూరులో గత ఏడాది జూలైలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న ఏఓ,వీఏఏ (ఫైల్),గడివేములలో ఇప్పటి వరకు ఈ-క్రాప్ నోచుకోని మొక్కజొన్న పంట

గడివేముల: అన్నదాత పరిస్థితి అయోమయంగా మారింది. టీడీపీ ప్రభుత్వ తీరుతో మళ్లీ ఇబ్బందులు తప్పవా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు రైతులు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తూ అన్నివిధాలుగా రైతులకు అండగా నిలిచింది. రైతులకు నేరుగా సేవలు అందజేసేందుకు సచివాలయాలకు అనుబంధంగా రైతుభరోసా కేంద్రాలు ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేయడంతోపాటు ఈ క్రాప్ నమోదు చేయించి రైతన్నను అన్నివిధాలుగా ఆదుకుంది జగనన్న ప్రభుత్వం. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం రైతుల సమస్యలను అసలు పట్టించుకోవడం లేదని విమర్శలు మొదలయ్యాయి. ప్రత్యేకించి ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ చేపట్టకపోవడంతో రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అందించే రాయితీలు, నష్టపరిహారాలు కోల్పోవాల్సిందేనని ఆవేదన చెందుతున్నారు. ఖరీఫ్ సీజన్ జూన్ 1న ప్రారంభమవ్వగా గడివేముల మండలంలో 32 ఎకరాల సాగు భూమి ఉండగా ఇప్పటికే దాదాపు 22 వేల ఎకరాలలో మొక్కజొన్న, మినుము, సోయాబీన్, ప్రత్తి, మిరప తదితర పంటలు సాగు చేశారు రైతులు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల కావస్తున్నా ఇంకా ఈ-క్రాప్ నమోదు ఊసేలేదు. అసలు పంట నమోదు ఉందో లేదోనని అన్నదాతలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కనీసం పంట నమోదుపై టీడీపీ ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వ్యవసాయాధికారుల నుంచి సరైన స్పష్టత లేకపోవడంతో ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాడు అన్నదాత.

గతేడాది గడివేముల రైతులకు రూ.1. 36 కోట్లు అందజేసిన జగనన్న ప్రభుత్వం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో 2019 నుంచి 2023 వరకు ఈ-క్రాప్ ఆధారంగానే రైతులకు పథకాలను వర్తింపజేసింది. ఏటా ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే ఈ క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించే వారు ఆర్బీకే వ్యవసాయ సహాయకులు. రైతులు పండించిన పంటను కూడా ఈ క్రాప్ ఆధారంగానే ప్రభుత్వం కొనుగోలు చేసేది. ప్రభుత్వం నుంచి మద్దతుధర లభించేది. ప్రకృతి వైపరీత్యాల మూలంగా పంటలు దెబ్బతింటే సీజన్ పూర్తయ్యే లోపల పరిహారం అందించేందుకు ఈక్రాప్ నమోదు ఎంతగానో ఉపయోగపడేది. కేవలం గతేడాది (2023) ఖరీఫ్ సీజన్ దెబ్బతిన్న పంటలకు జగనన్న ప్రభుత్వం గడివేముల మండలానికి సంబంధించి ఏకంగా రూ.1. 36 కోట్లు నష్టపరిహారం అందించింది కూడా. ఇంకా వివరంగా చెప్పాలంటే వర్షాభావ పరిస్థితుల మూలంగా వివిధ పంటలు నష్టపోయిన 1,478 మంది రైతులకు రూ.1,35,48,891 పరిహారం అందించినట్లు ఏఓ చెప్పారు.

ప్రయోజనాలు:

- పంటల బీమా వర్తిస్తుంది
- పంట రుణాలు మంజూరవుతాయి
- ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్టపరిహారం అందుతుంది
- పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించుకోవచ్చు
- సున్నావడ్డీ అమలవుతుంది. ఎరువులు, పురుగు మందులు తక్కువధరలకే సరఫరా చేస్తారు.
- వ్యవసాయ యంత్ర పరికాలు, పెట్టుబడి సాయం, ఉచిత బోర్లు మంజూరు

రైతులను ఆదుకోవాలి



రైతులను టీడీపీ ప్రభుత్వం ఆదుకోవాలి. గత ప్రభుత్వంలానే పెట్టుబడి సాయం అందజేయాలి. ఖరీఫ్ సీజన్ ముగుస్తున్నా పెట్టుబడి సాయం అందజేయకపోవడం సమంజసం కాదు. అదేవిధంగా ఈ క్రాప్ బుకింగ్ విషయాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై వ్యవసాయ అధికారుల నుంచి స్పష్టత లేదు. ఉన్నతాధికారుల స్పందించి ఈ క్రాప్ బుకింగ్‌కు ఆదేశాలు జారీచేసి రైతులకు ప్రభుత్వ మేలు చేకూరేలా చర్యలు తీసుకోవాలి.

– తలారి బాలచెన్ని, రైతు, గడివేముల గ్రామం

మార్గదర్శకాలు రాలేదు

పంటల నమోదుకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి ఇంతవరకు ఎటువంటి గైడ్‌లైన్స్ రాలేదు. రైతులకు సంబంధించి అన్నివిధాలుగా సహకారం అందజేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వర్తిస్తున్నాం. ప్రతి రైతుకు కౌలు కార్డులు మంజూరు చేయాలన్న ఆదేశాల మేరకు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా గ్రామాల్లో కౌలు కార్డుల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతుంది. అర్హులందరికీ కౌలుకార్డులు మంజూరు చేస్తాం.

– హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

అధికారులు పనితీరు మార్చుకోవాలి

- మండల మీట్‌లో ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి



ఐసీడీఎస్ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి

కోడుమూరు రూరల్ : అధికారులు కొందరు తమ పనితీరును మార్చుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోడుమూరు ఎంపీపీ గాడి రూతమ్మ, జెడ్పీటీసీ రఘునాథ్‌రెడ్డి సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన ఎంపీడీఓ దివ్య మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ మూడు నెలలకోసారి జరిగే సమావేశాలకు కూడా కొందరు మండల స్థాయి అధికారులు రావడం లేదని, ప్రజల సమస్యలు ఎలా పరిష్కారమవుతాయని ప్రశ్నించారు. ఐసీడీఎస్ అధికారుల పనితీరు బాగోలేదని, అంగన్‌వాడీ సెంటర్లు అస్తవ్యస్తంగా మారాయనన్నారు. చిన్నారులు, గర్భిణుల పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తున్నారని, ఎన్నిసార్లు చెప్పినా మార్పులేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల మీట్‌కు హాజరవ్వని సీడీపీఓకు మెమో జారీ చేయాలని ఎంపీడీఓను కోరారు. తహసీల్దార్ గుర్రప్ప మాట్లాడుతూ మండలంలో 10 రెవెన్యూ గ్రామాలకుగాను ఐదు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, ఏవైనా సమస్యలుంటే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న దృష్ట్యా మంచినీటి సరఫరాలో జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. లద్దగిరి హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ విష జ్వరాలు ప్రబలుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు, ఏపీఎం పుష్పావతి, ఏపీఓ మోదీన్‌బాషా, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, అగ్నిమాపక, పశువైద్య శాఖలకు సంబంధించిన అధికారులు తమతమ ప్రగతి నివేదికలను వివరించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, మాధవి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మారని ఉద్యోగుల తీరు!



ఉదయం 11 గంటలైనా ఖాళీగా దర్శనమిస్తున్న ఈర్లదిన్నె గ్రామ సచివాలయం

సి.బెళగల్: కొందరు ప్రభుత్వ ఉద్యోగుల తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు సైతం తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు. ఉద్యోగులు సమయపాలన పాటించడం లేదనే ప్రజల విమర్శలకు మండల పరిధిలోని ఈర్లదిన్నె (కొత్తకోట- 2) గ్రామ సచివాలయం ప్రత్యక్ష సాక్ష్యం. శనివారం ఉదయం 11 గంటల అవుతున్నా కనీసం ఒక్క ఉద్యోగి కూడా విధులకు హాజరుకాకపోవడంపై గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సచివాయంలో మొత్తం ఆరుగురు ఉద్యోగులు ఉండగా ఏ ఒక్కరూ రాకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరీక్షించాల్సి వచ్చింది. దీంతో ఉద్యోగుల తీరుపై గ్రామస్తులు విమర్శలు గుప్పించారు. ఏ రోజూ ఉద్యోగులు సక్రమంగా రారని, ఎప్పుడు వస్తారో... ఎప్పుడు వెళ్తారో ఎవ్వరికీ అర్థం కాదని ఆరోపించారు. సచివాలయ ఉద్యోగుల నిర్లక్ష్యాన్ని పంచాయతీ కార్యదర్శి (డీడీఓ) సైఫుల్లాబేగ్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. మరోమారు సమస్యను అధికారులకు వివరిస్తామని చెప్పారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కల్లూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. శనివారం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పర్యావరణ పరిరక్షణ అంశంపై శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో 82 ఈకో క్లబ్స్ ఫర్ మిషన్ గ్రూపులను ఏర్పాటు చేసి అందరితో మొక్కలు నాటించాలని ఎంఈఓ సూచించారు. అదేవిధంగా నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలన్నారు. సర్పంచ్ మాసేపోగు సుంకులమ్మ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి సహకారం



మొక్కలు నాటుతున్న దృశ్యం

ఓర్వకల్లు: పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని కెనరా బ్యాంక్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఆశోక్ చంద్ర తెలిపారు. శనివారం స్థానిక బాలభారతి పాఠశాలలో కెనరా బ్యాంక్ వారి ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల అవుట్‌రీచ్ కార్యక్రమం నిర్వహించారు. అశోక్‌చంద్ర మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా మరింత సుసంపన్నం చేయాలన్నదే బ్యాంక్ ఉద్దేశమన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య గౌరవ సలహాదారురాలు విజయ భారతి, కెనరా బ్యాంక్ ఉద్యోగులు, పొదుపు మహిళలు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' అమలుచేయాలి

కర్నూలు(సెంట్రల్): చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు బాబు గ్యారంటీ –భవిష్యత్‌కు షూరిటీ అంటూ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణి డిమాండ్ చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో జరిగిన సమాఖ్య కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని, ఏడాదికి మూడు సిలిండర్లను ఉచితంగా ఇస్తామని, ప్రతి మహిళకు రూ.1,500 ఇస్తామని, రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని, తల్లికి వందనం కింద ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి ఏడాదికి రూ.15 వేల చొప్పునా, నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చేవరకు నెలకు రూ.3 వేల చొప్పున భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చారన్నారు. ఆయా పథకాలను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే అమలు చేయాలన్నారు. లేదంటే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు.

అనుమతిలేని విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- డీఏఓ వరలక్ష్మి



కోడుమూరులో ట్రాన్స్‌ఫోర్టు దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఏఓ వరలక్ష్మి



కె.నాగలాపురంలో పంటలను పరిశీలిస్తున్న డీఏఓ వరలక్ష్మి

కోడుమూరు రూరల్: వ్యవసాయ శాఖ అనుమతిలేని ఎరువులు, మందులు, విత్తనాలు అమ్మితే ఆ దుకాణాలను సీజ్ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వరలక్ష్మి వ్యవసాయాధికారులను ఆదేశించారు. శనివారం కోడుమూరులోని ఎస్‌ఆర్‌ఎంటీ, క్రాంతి ట్రాన్స్‌ఫోర్టుల్లో ఏడీఏ ఖాద్రి, ఏఓ రవి ప్రకాష్‌లతో కలిసి డీఏఓ తనిఖీలు నిర్వహించారు. ఇప్పటి వరకు మండలంలోని విత్తన, ఎరువులు, మందుల దుకాణాలకు వచ్చిన దిగుమతుల వివరాలను పరిశీలించి లిస్టులోని దుకాణాల వివరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు పాటించని దుకాణాల నిర్వాహకులపై చర్యలు తప్పవని డీఏఓ హెచ్చరించారు. అలాగే గ్లైఫోసిట్ అనే గడ్డిమందును ప్రభుత్వం బ్యాన్ చేయడం జరిగిందని, విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆమె ఆదేశించారు.

గూడూరులో...

డీఏఓ వరలక్ష్మి గూడూరు మండలంలోని పెంచికలపాడు, కె.నాగలాపురం గ్రామాల్లో పర్యటించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్న రైతులు హరిత, మహేశ్వరరెడ్డి, సుంకన్న, ప్రవీణ్‌కుమార్ పొలాలను పరిశీలించారు. సాగు వివరాలపై రైతులతో చర్చించారు. ఒకే రకమైన పంటలను కాకుండా వివిధ రకాల పంటలు సాగు చేయడం ద్వారా నేలలో సేంద్రీయ కర్బనం పెరుగుతుందని డీఏఓ రైతులకు సూచించారు. పంట వైవిధ్యంతో పాటు, కంచె పంటలు, ఎర పంటలతో కలిపి అంతర పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. డీఏఓ వెంట ఏడీఏ ఖాద్రి, కన్సల్‌టెంట్ లక్ష్మయ్య, గూడూరు ఏఓ శ్రీవర్ధన్‌రెడ్డి ఉన్నారు.

సంప్రదాయ వనరులను కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న ఎంఈఓ సుబ్రమణ్యం



స్కూల్ ఆవరణలో మొక్కలు నాటుతున్న దృశ్యం



మొక్కల ప్రయోజనాలను వివరిస్తున్న ఉపాధ్యాయురాలు

పాణ్యం: మన చుట్టు ఉండే సంప్రదాయ వనరులను కాపాడుకోవాలని ఎంఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. మండల కేంద్రం పాణ్యంలోని ఉర్దూ పాఠశాలలో సమగ్ర శిక్ష సప్తహ్ కార్యక్రమంలో భాగంగా సహజ వనరులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కనీసం ఓ మొక్కను నాటి బాధ్యతగా సంరక్షించాలని సూచించారు. అనంతరం పాఠశాలలో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో షానాజ్‌బేగం, నిషార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని హెచ్‌ఎం ప్రాణేష్ కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని నన్నూరు జెడ్పీ హై స్కూల్‌లో శిక్షా సప్తాహ్ వారోత్సవాలలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేపట్టారు. ఏపీ ఎన్‌జీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం మాట్లాడుతూ పర్యావరణంపై అవగాహనతో జీవించడానికి నీరు, వ్యర్థాల నిర్వహణ, శక్తి, భూమి, గాలి, ఆహారం, వంటి ఆరు రకాల ఏకోక్లబ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అమ్మపేరుతో ఒక మొక్క అనే నినాదంలో తమ తల్లులతో కలిసి విద్యార్థులు మొక్కలు నాటారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్‌జీసీ కోఆర్డినేటర్ మద్దిలేటి, పాఠశాల ఉపాధ్యాయులు గౌరినందన రెడ్డి, హన్నా సైమన్, మటిల్డా, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం శిక్ష సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఎకో క్లబ్‌లో ఏర్పాటు చేసిన రకరకాల మొక్కలను సేకరించారు. ఔషధ మొక్కల ప్రయోజనాలపై హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు కలిసి ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దస్తగిరమ్మ, ప్రతాపరెడ్డి, మల్లికార్జునయ్య, పుష్ప కుమారి, చంద్రావతి పీఈటీ కవిత తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రమాణాలు పెరుగుతాయి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాసులు

కల్లూరు: సెల్‌ఫోన్‌ను తక్కువగా వాడితే మనిషి జీవన ప్రమాణాలు పెరుగుతాయని ఎంఈఓ శ్రీనివాసులు, ఫిజియోథెరపిస్ట్ రమేష్ బాబు పేర్కొన్నారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఎంఈఓ శ్రీనివాసులు అధ్యక్షతన ఫిజియోథెరపీ క్యాంప్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ ప్రతినిధులు రమేష్ బాబు, మహేష్ బాబు మాట్లాడారు. సెల్ ఫోన్ అధికంగా ఉపయోగించడం మూలంగా అనేక మానసిక, శారీరక రుగ్మతలకు గురి కావాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఫిజియోథెరపీ వెంకటేష్, ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఎంఈఓ కార్యాలయంలో పెరుగు శివారెడ్డి ప్రభుత్వ కంటి వైద్యశాల కర్నూలు ఆధ్వర్యంలో కంటి జబ్బులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి జబ్బుల గురించి కంటి వైద్యులు సుదర్శన్, కవిత వివరించారు. చూపు మందగింపును గుర్తించడంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు.

అక్రమ మద్యం తరలింపుపై ఉక్కుపాదం



స్వాధీనం చేసుకున్న మద్యం, ఆటోతో సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, వెల్దుర్తి క్రిష్ణగిరి మండలాల్లో అక్రమ మద్యం తరలింపుపై ఉక్కుపాదం మోపుతున్నట్లు సెబ్ సీఐ రామాంజినేయులు పేర్కొన్నారు. శనివారం సెబ్ సిబ్బందితో కలిసి క్రిష్ణగిరి మండలంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఆటోలో తీసుకెళ్తున్న తెలంగాణాకు చెందిన 116 క్వార్టర్, హాఫ్ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. మద్యం తరలిస్తున్న బోయ మోహనరంగడును అరెస్టు చేసి ఆటోను, మద్యంను సీజ్ చేశామన్నారు. అలాగే మన్నెగుంటలో సింగం మాధవస్వామి, ఎర్రగుడిలో లక్ష్మమ్మను అదుపులోకి తీసుకుని 166 కర్ణాటక రాష్ట్రం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వివరించారు. దాడుల్లో సుంకేసుల చెక్‌పోస్టు సీఐ మల్లిక, కోడుమూరు సెబ్ ఎస్ఐ ఆలీబేగ్, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, వెంకటేష్‌నాయక్, సూర్యప్రకాస్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు ఇన్‌చార్జ్ ఎస్ఆర్‌గా రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): కర్నూలు జాయింట్ –1 ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రకు బాధ్యతలు ఇచ్చినట్లు జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావు తెలిపారు. ఇక్కడ ఎస్ఆర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ కర్నూలు పరిధిలోని జొహరాపురం రోడ్డులోని సర్వే నంబర్ 154లోని 12.59 ఎకరాల వక్ఫ్ భూమిని సర్వే నంబర్ 154/1గా వేసి రిజిస్ట్రేషన్ చేసినట్లు నిర్ధారణ కావడంతో డీఐజీ సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ క్రమంలో ఆయన స్థానంలో రాఘవేంద్రకు ఇన్‌చార్జ్ ఇచ్చినట్లు వివరించారు. త్వరలోనే పూర్తిస్థాయి సబ్ రిజిస్ట్రార్‌ను నియమిస్తామన్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్‌లపై ఏడీ విచారణ

పాణ్యం: పాణ్యం సబ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా కనెక్షన్‌లు ఉండడంతో శనివారం నంద్యాల ఏడీ సతీష్ కుమార్ విచారణ చేపట్టారు. సిబ్బందితో కలిసి అక్రమ కనెక్షన్‌లపై ఆరా తీశారు. ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు సమాచారం. అలాగే గ్రామాలవారీగా కలెక్షన్లు, విద్యుత్ వినియోగం తదితర అంశాలపై ఆరా తీశారు.

నామినేషన్ల ఉపసంహరణ

కర్నూలు (టౌన్): నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పి.షాషావలీ, షేక్ అహమ్మద్ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. ఈ మేరకు శనివారం స్థానిక నగరపాలకలో మేనేజర్ చిన్నరాముడు, కార్యదర్శి నాగరాజులకు ఉపసంహరణ పత్రాలు సమర్పించారు.